క్లుప్తంగా

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.90 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,90,941 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్‌జీఆర్ నరసింహ బాబు, వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణలు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.82,210, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.37,960, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ..53,739, స్వామి పంచామృతాభిషేకానికి రూ.11,032, స్వామి శ్రీపాదకులకు రూ.6 వేలు వచ్చినట్లు ఈఓ నరసింహబాబు పేర్కొన్నారు.

ప్రజా వేదికకు రెండు అర్జీలు

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా వేదికకు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్‌కే నాగూర్‌మీరా తెలిపారు. భూమి దారి సమస్యలపై రెండు అర్జీలు వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

9, 10 తేదీల్లో స్కూల్‌గేమ్స్ పోటీలు

సీఎస్‌పురం(పామూరు): మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు డీజీపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం పీఎం రసూల్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారు తమ వివరాలను 8309805143 నంబర్లో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. అండర్–14, అండర్–17 బాల, బాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్మికులను తొలగించడం సరైంది కాదు

కనిగిరిరూరల్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం సరైంది కాదని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం లేబర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందచేశారు. కనీస నిబంధనలు పాటించకుండా, కార్మికులను విధుల నుంచి తొలగించడం సరైంది కాదన్నారు. కార్మికుల న్యాయం చేయకుంటే ఏఐటీయూసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, దళిత సంఘ నాయకులు శాంతరాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, దారా కొండయ్య, జొన్నలగడ్డ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


భోజనం వడ్డిస్తున్న స్నేహ హస్తం ప్రతినిధులు

కనిగిరిరూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, అనాథలు, వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ డి.సుధీర్‌బాబు, ప్రతినిధులు మీరా మొహిద్దీన్, మోహన్ కుమార్, సందీప్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న మండల సమావేశం

సింగరాయకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సమావేశం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కనిగిరిరూరల్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్ గుడిపాటి రంగనాయకులు సోమవారం పేదలకు దుస్తులు, ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర లేబర్ పూర్ కమ్యూనిటీస్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జిగా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌గా నియమితులైనందుకు సేవాహిత కార్యక్రమాలు చేపట్టినట్లు రంగనాయకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పూజలు


పోలేరమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజల్లో భక్తులు

కనిగిరిరూరల్: స్థానిక పాత కూచిపుడిపల్లిలో పోలేరమ్మ దేవతా జీర్ణోద్ధరణ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, కలశస్థాపన కార్యక్రమాలు నియమనిష్టలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పప్పు కూడు కరువాయే..!

- రేషన్ దుకాణాల్లో కానరాని కందిపప్పు
- 9 నెలలుగా అదే పరిస్థితి
- బహిరంగ మార్కెట్‌లో ధరల మోత



కనిగిరిరూరల్:

కూటమి సర్కార్ పాలనలో పేద, మధ్య తరగతి వర్గాలకు పప్పు కూడు కరువైంది. దాదాపు 9 నెలలుగా రేషన్ దుకాణాల్లో కంది పప్పు పంపిణీ చేయడం లేదు. గత ప్రభుత్వంలో పేదలకు నెల నెలా రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కందిపప్పు సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆదిధికారంలోకి వచ్చాక రెండు, మూడు దఫాలు మాత్రమే కందిపప్పు పంపిణీ జరిగింది. ప్రతి నెలా వచ్చే నెల కందిపప్పు వస్తోందని... అధికార పార్టీకి చెందిన డీలర్లు కార్డుదారులకు చెప్తూ తప్పించుకుంటున్నారు. దీనిపై కార్డుదారుల గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రేషన్ సరుకుల్లో కేవలం బియ్యం, చక్కెరకే పరిమితం చేసింది.

నియోజకవర్గంలో కేటాయింపు ఇలా..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 83 వేల మందికి రేషన్ కార్డులు ఉన్నట్లు నివేదికలున్నాయి. ఆరు మండలాల్లో 217 రేషన్ షాపులున్నాయి. కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్ పరిధిలోని కనిగిరి, వెలిగండ్ల, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు, మండలాల్లోని 101 రేషన్ షాపులకు 650 టన్నుల పీడీఎస్ బియ్యం(రేషన్ బియ్యం), 17 టన్నుల చక్కెర, కంది పప్పు సుమారు 55 టన్నులు రావాల్సి ఉంది. అలాగే కనిగిరి పరిధిలోని పామూరు ఎఫ్‌సీఐ గోడౌన్ పరిధిలోని పామూరు 44, సీఎస్‌పురం 35 రేషన్ షాపులకు 550 టన్నులు బియ్యం, 14 టన్నులు చక్కర, 40 టన్నులు కంది పప్పు రావాల్సి ఉంది. గత కొన్ని నెలలుగా కంది పప్పు ఊసేలేదు.

డిమాండ్ ఉన్నా.. పంపిణీ సున్నా..

ప్రజలు కంది పప్పును అధికంగా వినియోగిస్తారు. రేషన్ షాపుల్లో కూడా ఎక్కువ మంది కార్డుదారులు కందిపప్పును తీసుకెళ్తారు. కానీ ప్రభుత్వ గత 7,8 నెలలుగా కంది పప్పు సరఫరా పూర్తిగా నిలిపి వేసింది. బయట మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలో కంది పప్పు ధర రూ.110 నుంచి రూ. 120 వరకు అమ్ముతున్నారు. రేషన్ దుకాణంలో రూ.67కే ఇచ్చే కంది పప్పును అదనంగా సుమారు 60 పెట్టి కొని తినలేక సామాన్య మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారు.

రేషన్ దుకాణాల్లో కంది పప్పు సరఫరా చేయాలి:



రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పు, నిత్యవసర సరుకులు సంపూర్ణంగా సరఫరా చేస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించారు. నిత్యవసర సరుకులు, కందిపప్పు, వంట నూనెతో ఇతర సరకులను రేషన్ కార్డుదారులకు అందచేయడం సర్కారు బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు రూ.110 నుంచి రూ.130 వరకు అమ్ముతున్నారు. పేద మధ్య తరగతి వారు కొనుగోలు చేయలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కందిపప్పును అందించాలి.

జి గాయత్రి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా మాజీ కార్యదర్శి

వైభవంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట

- కనులపండువగా సీతారాముల శాంతికల్యాణం

పామూరు: మండలంలోని తిరగలదిన్నెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తుల, ధ్వజస్తంభ, కలశప్రతిష్టా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్టాచార్యులు రావినూతల రమేష్, ఆలయ అర్చకులు కురిమేటి నరేంద్ర ఆధ్వర్యంలో యంత్ర స్థాపన నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల మూలవిగ్రహమూర్తులను ప్రతిష్టించారు. ప్రతిష్టానంతరం సీతారామచంద్ర మూర్తులకు ఆలయ ముఖమండపంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శాంతికల్యాణం జరిపించారు. అనంతరం సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పిన్నిక వెంకటరమణమ్మ, ఎంపీటీ బొట్లా నాగార్జున, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


నూతనంగా ప్రతిష్ఠించిన సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూలవిగ్రహమూర్తులు


సీతారాముల ఉత్సవమూర్తులకు శాంతికల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకున్న చైర్మన్ గఫార్


అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: స్వచ్ఛ భారత్ మిషన్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా జిల్లా స్థాయిలో ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం «స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్ –2025»ను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అందుకున్నారు. అవార్డును కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణ ప్రజల సహకారం, మున్సిపల్ సిబ్బంది కృషి, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రజాప్రతినిధుల పరిశుభ్రతా కార్యక్రమాల నిర్వహణలతో అవార్డును సాధించినట్లు వెల్లడించారు, కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాతరెడ్డి, దేవకి సత్యావతి, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ సంస్థ కన్వీనర్ మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కనిగిరిరూరల్: చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు వెదురుకుప్ప మండలం దేవలంపేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు సోమవారం స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఒక పిరికిపంద చర్య అన్నారు. ఇది కేవలం విగ్రహంపై దాడి కాదని, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రభుత్వం ఘటనపై తక్షణం స్పందించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, బహుజన, మైనార్టీ సంఘాల నాయకులు చదలవాడ బాలగురవయ్య, పందిటి మోహన్, శాంతరాజు, దేవూరి వెంకటేశ్వర్లు, న్యాయవాది చింతంగుంట్ల కిషోర్, సుబ్బారావు, కొటికర్ల బాదుర్లా, కోమటిగుంట్ల బాబురావు, స్వర్ణ యానాది, రాములు, కుడారి కొండయ్య, జోన్నల గడ్డ చిన్న తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏఎస్‌ఓ వెంకట రమణారెడ్డి

కనిగిరిరూరల్: పంట కోత ప్రయోగాలు నిర్వహించేటప్పుడు వ్యవసాయ సిబ్బంది, సంబంధిత గణాంక అధికారులు కచ్చితంగా వ్యవహరించాలని ఏడీఏ జైనులాబ్దిన్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రధానమంత్రి ఫసలీ బీమా పథకం కింద గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ జైనులాబ్దిన్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల్లో నమోదు చేసిన దిగుబడి ప్రకారం రాష్ట్ర స్థాయిలో ధాన్యం ఉత్పత్తి, వినియోగం అంచనాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు బీమా చెల్లింపులు చేస్తారన్నారు. ఏఎస్‌ఓ పిల్లి వెంకట రమణారెడ్డి, ఆరు మండలాల వ్యవసాయాధికారులు రంగకృష్ణ, రవి, శిల్పా, అబ్రహం లింకన్, గణాంక అధికారులు సుధాకర్ రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి బుర్రా పరామర్శ


కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుర్రా

లింగసముద్రం: వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటానని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ భరోసా ఇచ్చారు. ముత్యాలపాడు గ్రామంలో పార్టీ నాయకుడు కన్నె కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని సోమవారం బుర్రా పరామర్శించారు. కృష్ణమూర్తి సతీమణి కాంతమ్మ, కుటుంబ సభ్యలతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ నోటి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, కన్నె రాజారావు, మల్లెబోయిన వెంకటేశ్వర్లు, వట్టి గుంట వెంకటేశ్వర్లు, మందా కొండయ్య, చీమల శ్రీను, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంబోతు కాలువలో ఆక్రమణలు తొలగిస్తాం


ఆంబోతు కాలువను పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజేష్

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: ఆంబోతు కాలువ ఆక్రమణలకు గురవడంతో పాటు కాలువను పూడ్చి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని «ఆంబోతు కాలువ ఆక్రమణ» శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాజేష్ సోమవారం కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. కాలువను పూర్తిగా సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి కాలువను పునరుద్ధరించి వర్షం నీరు చెరువులకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్లు సాయి, రచన పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా కంభంపాడు


కలెక్టర్, జెడ్పీ సీఈఓ నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రామయ్య

సీఎస్‌పురం(పామూరు): జిల్లా ఉత్తమ గ్రామ పంచాయతీగా మండలంలోని కంభంపాడు ఎన్నికైంది. ఈ సందర్భంగా సోమవారం ఒంగోలు రిమ్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు, ప్రశంసాపత్రాన్ని కంభపాడు పంచాయతీ సర్పంచ్ మర్రి రామయ్య అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్యం, అభివృద్ధికి సంబంధించి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి డి.పాండురంగారావు, వేల్పుల నారాయణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 4 అర్జీలు

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నయీం అహ్మద్ తెలిపారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ చుండి గ్రామస్తులు 4 అర్జీలు అందజేశారని పేర్కొన్నారు. కార్యాక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర


కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: నాణ్యమైన బేళ్లకు అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం వేలం సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. క్లస్టర్ పరిధిలోని ముప్పరాజుపాలెం, పెరిదేపి, అనకర్లపూడి, మిట్టపాలెం గ్రామాల రైతులు 1351 బేళ్లను తీసుకురాగా 1093 బేళ్లను కొనుగోలు చేసి 258 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.85, సరాసరి ధర రూ.234.93గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 187 పొగాకు బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. ఎం నిడమానూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు1166 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 979 బేళ్లను కొనుగోలు చేసి 187 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.90, సరాసరి ధర రూ.284.11 పలికింది. వేలంలో 42 కంపెనీలు పాల్గొన్నాయి.

ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు: ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, ఇతరత్రా వ్యక్తిగత సమస్యలపై మొత్తం 7 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం ఇతర సమస్యల పరిష్కారం కోసం 9177700267ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కందుకూరు డిపోలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

కందుకూరు: దాతల సహకారంతో కందుకూరు ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. సావిటర్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీ రమేష్ తన తల్లి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, హనుమంతరావు, పద్మారావు, కె.రమేష్‌బాబు, మహేష్‌బాబు, సుబ్బారావు, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే మెరుగైన విద్య


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రభావతి

కందుకూరు రూరల్: పోషకాహారంతోపాటు మెరుగైన విద్య కేవలం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ప్రబావతి పేర్కొన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమాన్ని మండలంలోని శామీరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. 3 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హసీనా, అపర్ణ, సుభాషిణి, వరమ్మ, అనిత, రేవతి, వరల్డ్ విజన్ ప్రతినిధి బూదియ, ఆశా కార్యకర్త వెంకమ్మ పాల్గొన్నారు.

టీచర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన బుర్రా


టీచర్ అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బుర్రా

కందుకూరు రూరల్: దసరా పండగ రోజున రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు యాదనబోయిన అశోక్ కుమార్ కుటుంబ సభ్యులను పలుకూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూధన్‌యాదవ్ సోమవారం పరామర్శించారు. బుర్రా వెంట వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు తోకల కొండయ్య, చీమల వెంకట రాజా, గణేశం గంగిరెడ్డి, వాకా శ్రీనివాసులరెడ్డి, అప్పనబోయిన రాజేష్, బొల్లిబోయిన వేణు, దొడ్డంరెడ్డి మదన్‌మోహన్ రెడ్డి, కావులూరి మధుసూధన్, యన్నాబత్తిన మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

కందుకూరు రూరల్: సూపర్ జీఎస్టీ 2.0, సూపర్ సేవింగ్స్‌పై కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ.. నూతనంగా అమల్లోకి వచ్చిన జీఎస్టీపై సామాన్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. జీఎస్టీపై విద్యార్థులు, సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. జీఎస్టీ శ్లాబ్‌లో వచ్చిన మార్పులు దాని ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి సీహెచ్.శ్రీనివాసరావు, జీఎస్టీ స్థానిక వార్డు–2 నోడల్ ఆఫీసర్ కొండమ్మ, సచివాలయ అడ్మిన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం: ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో మండలంలోని లింగసముద్రం, మొగిలిచర్ల, చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఫిరోజ్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.